రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- త్వరలో ఆర్‌బీకేల పరిధిలో గోడౌన్లు
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- అట్టహాసంగా తొట్టంబేడు సింగిల్ విండో కార్యవర్గ ప్రమాణం


ప్రమాణ స్వీకారం చేస్తున్న పోతుగుంట మణినాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం తొట్టంబేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(సింగిల్‌విండో) ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. చైర్మన్‌గా పోతుగుంట మణినాయుడు, డైరెక్టర్లుగా యర్ర భక్తవత్సలం, కాసరం ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాయితీగా పనిచేస్తే పదవులు వెతుక్కుంటూ వస్తాయని తెలిపారు. నూతన కమిటీ రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మణినాయుడు ఎంతో సౌమ్యుడని, అందుకే ఆయనను పదవి వరించిందన్నారు. శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు చైర్మన్‌గా మిత్రుడు శెట్టిపల్లి సురేష్, కాపుగున్నేరి సొసైటీకి చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అదే బాటలో మణినాయుడు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బసవయ్యపాళెం, చిట్టత్తూరు, తొట్టంబేడు ఆర్‌బీకే కేంద్రాల పరిధిలో గోడౌన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన వారిని అభినందించారు. వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల కన్వీనర్ వాసునాయుడు మాట్లాడుతూ బొజ్జల సుధీర్‌రెడ్డి తొట్టంబేడులో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు రూ.6లక్షలతో పూర్తవుతాయని చెప్పడం సరికాదన్నారు. ఒక గ్రామానికి లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టమని ఎమ్మెల్యేను కోరుతున్నామని, సుధీర్‌రెడ్డికి రూ.6లక్షలు ఇస్తామని, వాటితో పనులు పూర్తి చేయించాలని సవాల్ విసిరారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పేరుతో ఎంత దోపిడీ చేశారో చర్చకు వస్తే ఆధారాలతో నిరూపిస్తామన్నారు. వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, చంద్రయ్యనాయుడు, భాస్కర్, రమేష్, డిల్లీబాబు, మహబూబ్‌బాషా, జీవీ నాయుడు, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సుధీర్ నోరు తెరిస్తే అబద్ధాలే

టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డికి నిజాయితీ అనేది లేదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సుధీర్ ప్రకటనలపై సింగిల్ విండో ప్రమాణ స్వీకారోత్సవంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సుధీర్‌కు నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప మరొకటి రావన్నారు. అసత్య ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాడన్నారు. తాను ధరించే వాచ్ ఖరీదు రూ.4కోట్లు అని మీడియా ఎదుట పచ్చి అబద్ధాలు చెప్పాడని పేర్కొన్నారు. నా వాచ్‌ని మీడియా వారికి ఇస్తాను.. నాకు రూ.40 వేలు ఇచ్చి, 30 ఏళ్లు నిన్ను, నీ తండ్రిని నమ్ముకుని ఆర్థిక ఇబ్బందులో ఉన్న వారికి రూ. కోటి పంచిపెట్టు, మరో రూ.2కోట్లు హిందు, ముస్లిం, క్రిస్టియన్ల పేద ప్రజలకు పంచు.. మిగిలింది నువ్వు గిఫ్టుగా పెట్టుకో' అని సుధీర్‌కు బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఎవరో రాసిన స్క్రిప్టు చదివే సుధీర్‌రెడ్డికి సామాన్య ప్రజల బాధలెలా తెలుస్తాయన్ని ప్రశ్నించారు.

క్రీడలతో మానసికోల్లాసం


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం: క్రీడలతో మానసికోల్లాసం, యువతలో ఐక్యతాభావం వెల్లివిరిస్తుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నాగలాపురం యూత్ ఆధ్వర్యంలో రెండు రోజు మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో చుట్టుపక్కన గ్రామాలు, తమిళనాడు నుంచి దాదాపు 40 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపి రాణించాలని తెలిపారు. నిర్వాహకులు హరిబాబు, ధర్మతేజ మాట్లాడుతూ ఆదివారం బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండవ బహుమతిగా రూ.20వేలు, మూడవ బహుమతిగా రూ.15 వేలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, పట్టణ అధ్యక్షుడు ఎల్.సురేష్ మాణిక్యం, కార్మిక విభాగం నేత ఎస్ఎం సురేష్, సర్పంచ్ సుధా చిన్నదొరై, సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలజీ, సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలియార్, సోషల్ మీడియా ప్రతినిధి ఈశ్వర్, నాగలాపురం వైస్ సర్పంచ్ సునీత, పీఈటీలు బాబు,సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి


మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన సుమన్‌కుమార్

నారాయణవనం: మండలంలో వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అయ్యేందుకు నిధుల విడుదలలో పూర్తి సహకారాన్ని అందివ్వాలని విద్యుత్, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్ కోరారు. శనివారం రాత్రి తిరుపతిలోని మంత్రి నివాసంలో మంత్రిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పూర్తి చేసిన పనులకు తుది బిల్లులు మంజూరు చేయించాలని మంత్రిని కోరినట్లు సుమన్ తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో సచివాలయాలకు మంజూరు అయిన పనులను సకాలంలో పూర్తి చేయించాలని మంత్రి సూచించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పల్లికొండేశ్వరుడి సేవలో భూమన రేవతి


తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో వెలసి ఉన్న ప్రముఖ శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సతీమణి రేవతి, కుటుంబ సభ్యులు దర్శించారు. వారికి దేవస్థానం చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు ప్రసాద్ వేద ఆశీర్వనం చేశారు. చైర్మన్ తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

రేణిగుంట జాతరకు రండి


ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న మల్లికార్జునరెడ్డి

రేణిగుంట: రేణిగుంట గంగమ్మ జాతర మహోత్సవాలకు రావాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆలయ పెద్దలు ఆహ్వానించారు. శనివారం శ్రీకాళహస్తిలోని ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యేను ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి సత్కరించారు. ఈనెల 22, 23 తేదీల్లో గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు జ్యోతినారాయణ, లక్ష్మీరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీవేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయంలో ఏకాదశి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేక పూజలు అనంతరం సుందరంగా శ్రీస్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు.

అంతర పంటలతో అధిక ఆదాయం


నారు మొక్కలను పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు

రేణిగుంట: మామిడి తోటల్లో అంతర పంటల సాగుతోఅధిక ఆదాయం పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ వనస్థలిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతులకు మామిడిలో అంతర పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సంవత్సరం లోపు వయస్సు ఉన్న మామిడి తోటలో ఖరీఫ్ సీజన్‌కు అనుకూలమైన కూరగాయలు, పూల మొక్కలు పెంపకం చేపడితే ఎకరాలకు రూ.50 వేలు నుంచి రూ.60వేలు వరకు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మామిడి అంతర పంటల సాగుపై క్షేత్ర ప్రదర్శనల నిమిత్తం బెంగుళూరు ఐఐహెచ్‌ఆర్ వారు రూపొందించిన టమోటా 'అర్కా సామ్రాట్' రకం, మిరప అర్క హరిత, ఉల్లి ఎస్ఎస్-53, బంతి అర్కా అభి వంటి మేలు జాతి వంగడాలకు చెందిన నారు మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్, వివిధ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

జోరుగా జెండాల అమ్మకాలు

శ్రీకాళహస్తి: ఆజాదీకా అమృత్ ఉత్సవ్‌లో భాగంగా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు పతాకాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పోస్టాఫీస్‌ల ద్వారా రూ.25కు జాతీయ జెండాలను విక్రయిస్తున్నారు. శనివారం ఉపాధ్యాయులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున జెండాలు కొనుగోలు చేశారు.

మృతుడి కుటుంబానికి సాయం

ఏర్పేడు: మండలంలోని కందాడు ఎస్సీ కాలనీలో తోకల బత్తెయ్య కుటుంబానికి శనివారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి నగదును సాయం చేసి చేయూత నిచ్చారు. బత్తెయ్య (45) విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాలకు రూ.10 వేలు అందించారు. మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, నాయకులు నాగరాజు, రాంబత్తెయ్య పాల్గొన్నారు.

వేడుకగా ఏకాదశి ఉత్సవం


తిరుచ్చిపై విహరిస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనం అధిరోహించి మాడ వీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేసి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. శనివారం కావడంతో భక్తులు ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం కైంకర్యాల అనంతరం తిరుచ్చి వాహనంపై ఉభయ నాంచారుల సమేతంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు మాడ వీధుల్లో కొనసాగింది. భక్తులు అడుగడుగునా హారతులు సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు, సహాయకులు షనాయి, భద్రతా జమేదార్ రాజకుమార్ పర్యవేక్షించారు.

ఘనంగా పార్వేట ఉత్సవం


విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు, పురవీధుల్లో విహారం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయ ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలు మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను చప్పరాలపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లను దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమలో ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న కుమారస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం పాకాల మండలం పార్వేటిపల్లెకు చెందిన వి.కుమారస్వామి, కుటుంబ సభ్యులు కౌశల్‌కుమార్ పేరిట రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో చోరీ

పిచ్చాటూరు: పిచ్చాటూరు పాత వెంకటేశ్వర థియేటర్ పక్కన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం..వేలూరు దళితవాడకు చెందిన రాము పిచ్చాటూరులో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. స్వగ్రామమైన వేలూరు దళితవాడలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్ద శుక్రవారం రాత్రి రాము దంపతులు నిద్రించారు. విషయం తెలుసుకున్న దొంగలు రాము అద్దె ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి అందులో ఉన్న 5 సవర్లు బంగారు నగలు, 400 గ్రాముల వెండి, రూ.15 వేలు నగదును ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఇంటికొచ్చిన రాము తాళాలు పగులగొట్టి ఉండడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

సఫాయ్ కరమ్‌చారీల సంక్షేమ బాధ్యత ఏజెన్సీలదే


మాట్లాడుతున్న జాతీయ సఫాయ్ కరమ్‌చారీస్ కమిషన్ చైర్మన్ వెంకటేశన్

రేణిగుంట: సఫాయ్ కరమ్ చారీ(పారిశుద్ధ్య కార్మికులు)ల సంక్షేమ బాధ్యత ఆయా ఏజెన్సీలదేని, అవే కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించాలని జాతీయ సఫాయి కరమ్‌చారీస్ కమిషన్ చైర్మన్ ఎస్.వెంకటేశన్ అన్నారు. రేణిగుంట పాత విమానాశ్రయ సమావేశం హాల్‌లో శనివారం సాయంత్రం ఆయన ఎయిర్‌పోర్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్‌లో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్, శానిటరీ వర్కర్స్‌ను పిలిచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ హౌస్ కీపింగ్, శానిటరీ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా జాతీయ సఫాయ్ కరమ్ చారీస్ కమిషన్ ఏర్పాటైందన్నారు. రేణిగుంట విమానాశ్రయంలో పనోరమ ఏజెన్సీ పరిధిలో 73 మంది హౌస్ కీపింగ్, శానిటరీ వర్కర్లు పని చేస్తున్నారని, వారికి రూ.494 వంతున రోజువారీ వేతనం నెలలో 26 రోజులకు ఇస్తున్నట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ఏవైనా సమస్యలుంటే నిర్భయంగా తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. పీఎఫ్ డబ్బులు ప్రతి నెలా సరిచూసుకోవాలని కార్మికులకు సూచించారు. నామినీ పేరు తప్పులు లేకుండా చూసుకోవాలని, ఏజెన్సీ జమ చేయాల్సిన పీఎఫ్ మొత్తం జమ అవుతోందా? లేదా? అని చెక్ చేసుకోవాలని తెలిపారు. ఏజెన్సీ ప్రతి ఆరు నెలలకొకసారి కార్మికులకు మెడికల్ క్యాంపులను నిర్వహించాలని సూచించారు. ఐడీ కార్డులో పీఎఫ్, ఈఎస్ఐ నంబర్లను ప్రింట్ చేయాలన్నారు. ఏవైనా ఫిర్యాదులుంటే కార్మికులు 62815 47701 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే బాధ్యుల వివరాలను గోప్యంగా ఉంచి, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయన్ని రేణిగుంట ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బసవరాజు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బసవరాజు, ఆపరేషన్స్ డైరెక్టర్ శివప్రసాద్, ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి చెన్నయ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి మున్సిపల్ కమిషనర్లు రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, పనోరమ ఏజెన్సీ ప్రతినిధి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన వీవీ పాట్స్


వీవీ పాట్స్‌ను రేణిగుంట సీడబ్ల్యూసీ గోడౌన్‌లో భద్రపరుస్తున్న డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి

రేణిగుంట: ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియకు వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రపు వీవీ పాట్స్‌ను శనివారం రేణిగుంట సమీపంలోని సీడబ్ల్యూసీ గోడౌన్‌లో భద్రపరిచారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు బెంగళూరు బెల్ కంపెనీ నుంచి ఐదు కంటైనర్లలో వచ్చిన 6,450 వీవీ పాట్లను ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్లో భద్రపరిచారు. అందరి సమక్షంలో డీఆర్ఓ కోదండరామిరెడ్డి లారీ కంటైనర్ల సీల్ ఓపెన్ చేసి వీవీ పాట్లను గోడౌన్‌లోకి తీసుకెళ్లారు. ఆపై గదికి సీల్ వేశారు. డీఆర్ఓ మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నిమిత్తం జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు వీవీ పాట్‌లను భద్రపరిచినట్లు తెలిపారు. ఇక్కడ పోలీస్ నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. శ్రీకాళహస్తి ఆర్‌డీఓ రామారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, విజయభాస్కర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, టీడీపీ నాయకుడు నరసింహయాదవ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి- నలుగురిపై కేసు

ఏర్పేడు: రాచపాలెంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం రాత్రి తెలిపారు. మండలంలోని కందాడు పంచాయతీ పరిధి రాచపాలెం గ్రామానికి చెందిన బత్తయ్య శనివారం కాలినడకన వెళుతుండగా అదే గ్రామానికి చెందిన బలరామయ్య, ఉమాపతి, మధు, నాగరాజు దాడి చేసి గాయపరిచారు. బత్తయ్య భార్య పెంచులమ్మ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

గ్రామాల్లో నాభూమి- నాదేశం

రేణిగుంట: ఆజాదీకా అమృత్ వారోత్సవాల్లో భాగంగా 'నా భూమి- నా దేశం' కార్యక్రమం శనివారం రేణిగుంటలో ఘనంగా నిర్వహించారు. రేణిగుంట, వెంకటాపురం, గాజులమండ్యం, విప్పమానుపట్టెడ, ఎల్లమండ్యం పంచాయతీల్లో ' నా భూమి- నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధి హామీ పథకం డ్వామా జిల్లా ఏపీడీ సరిత ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయా పంచాయతీలలో 'నా భూమి- నా దేశం' శిలాఫలకాలను ఆవిష్కరించారు. నేల తల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమాలను చేపట్టారు. జాతీయ పతాకాన్ని చేతపట్టి దేశ సమగ్రతను కాపాడుతామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. ప్రతి పంచాయతీలో 75 చెట్లు చొప్పున నాటారు. సరిత మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం లౌకిక రాజ్యంగా విరాజిల్లుతూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతి భారతీయ పౌరునిలో స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని నింపడమే కాకుండా వారిలో సమాజం పట్ల బాధ్యత, దేశభక్తిని పెంపొందించే విధంగా గ్రామాల్లో 'నా భూమి- నా దేశం' కార్యక్రమం చేపట్టాలన్నారు. మండలంలోని విప్పమానుపట్టెడలో మహిళలు మట్టి ప్రమిదలను వెలిగించి స్వాతంత్ర సమరయోధులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నగేషం, గంగారి రమేష్, లక్ష్మీపతిరెడ్డి, ఉపాధిహామీ పథకం ఏపీవో జ్యోతిశ్రీ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, రేణిగుంట బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధనం, టెక్నికల్ అసిస్టెంట్లు లీల, మల్లేశ్వరి, ఈసీ జయంతి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ఏర్పేడు: పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు


రేణిగుంటలో 'నా భూమి- నా దేశం' శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సర్పంచ్ నగేషం

అట్టహాసంగా నా భూమి- నా దేశం

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు, పాతవీరాపురం, పెన్నగడం గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం నాభూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం జరిగింది. నాభూమి-నాదేశం శిలాఫలకం వద్ద సిబ్బంది, కూలీలు రంగవల్లులు వేసి పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తాతేకాల్వ మోహన్‌రెడ్డి, మంజుల, స్రవంతి, పంచాయతీ కార్యదర్శి వాసు, ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు మనోహర్, పట్టాభిరెడ్డి, క్షేత్ర సహాయకులు గీతాంజలి, శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు శంకర్‌రెడ్డి కన్నతి భాస్కర్‌రెడ్డి, వెంకటాద్రి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.